సాక్షి
కుమురం భీం
ఆదివారం । 6 । జూలై । 2025



రేబిస్‌తో జాగ్రత్త 8లో▸

పశుపోషకులు, జంతు, పక్షి ప్రేమికులు జూనోసిస్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పశువైద్యులు సూచిస్తున్నారు. నేడు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా కథనం..



విద్యార్థుల 'యోగా'నందం

పాఠశాలల్లో విద్యార్థులతో యోగా, ధ్యానం చేయించాలని, కథల పుస్తకాలు, పత్రికలు చదివించాలని ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
30.1 /24.2

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

రోడ్లపై చెత్త.. కాలువల్లో పూడిక..

• మున్సిపాలిటీల్లో గాడితప్పిన పారిశుద్ధ్య నిర్వహణ • నిషేధిత ప్రాంతాల్లో చెత్తను వేస్తున్న ప్రజలు • పొంచిఉన్న వ్యాధుల ముప్పు • 100 రోజుల ప్రణాళికలోనైనా మెరుగుపడేనా..?

జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య నిర్వహణ గాడితప్పుతోంది. వర్షాకాలంలో వ్యాధుల ముప్పు పొంచి ఉన్నా.. రోడ్లపైనే చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. మురుగునీరు ఇళ్ల మధ్యనే నిలుస్తోంది. కొన్నిచోట్ల రోడ్లపైనే పారుతోంది. ఇక డ్రెయినేజీల్లో నెలల తరబడి పూడిక తీయడం లేదు. పట్టణాల్లోని ఖాళీ స్థలాలు దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. దీంతో వ్యాధుల ముప్పు పొంచి ఉందని పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెండు మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య పరిస్థితిపై ప్రత్యేక కథనం.



ఈ ఫొటోలో కనిపిస్తోంది కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీనగర్ ఏరియాలోని ప్రధాన రోడ్డు పక్కన గల డ్రెయినేజీ. ఈ కాలువ నిర్మాణం సరిగా చేపట్టకపోవడంతో మురుగునీరు కాలువలోనే నిలిచి ఉంటోంది. దీనికి తోడు ప్లాస్టిక్ కవర్లు, చెత్తా చెదారం ఇందులోనే వేస్తుండడంతో పేరుకుపోయి దుర్గంధం తలపిస్తోంది. వర్షాకాలంలో నీరు నిలిచి ఉండడంతో దోమలు, ఈగలు వృద్ధిచెంది రోగాల బారిన పడే అవకాశం ఉందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఫొటోలో కనిపిస్తోంది కాగజ్‌నగర్ పట్టణంలోని సీతాపతిరోడ్ నుంచి ప్రధాన రహదారికి వెళ్లే మార్గంలో ఉన్న ఖాళీ స్థలం. ఇందులో బాలాజీనగర్, శ్రీరాంనగర్ కాలనీవాసులు ప్రతీరోజు ద్విచక్ర వాహనాల పై చెత్తను తీసుకువచ్చి ఇక్కడ వేస్తున్నారు. ఇందిరా మార్కెట్ వ్యాపారులు సైతం కుళ్లిన కూరగాయలు, పండ్లు తీసుకువచ్చి ఇక్కడే వేయడంతో చెత్తకుప్పగా మారింది. అంతేకాకుండా ఆఫీసులకు వెళ్లేవారు కూడా కవర్లలో చెత్తను తీసుకువచ్చి ఇక్కడే పడేస్తున్నారు. ఖాళీ స్థలంలో చెత్తవేస్తే రూ.500 జరిమానా విధిస్తామని మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు వారికి కనిపించకపోవడం గమనార్హం



చర్యలు తీసుకుంటున్నాం

పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. మున్సిపాలిటీ పరిధిలో ఖాళీ స్థలాలు, నిషేధిత ప్రాంతాల్లో చెత్త వేసిన వారికి నోటీసులు జారీ చేస్తాం. 30 వార్డుల్లో పారిశుద్ధ్య సిబ్బందితో విడతల వారీగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టడం జరుగుతోంది.

– ఎల్ములు రాజేందర్, కమిషనర్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీ

సాక్షి ఫోకస్

కాగజ్‌నగర్‌టౌన్/కాగజ్‌నగర్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలో ట్రాక్టర్లతో ప్రతిరోజు చెత్త సేకరణ చేస్తున్నా కొందరు సిబ్బందికి ఇవ్వకుండా ఖాళీ ప్రదేశాలు, రోడ్ల వెంబడి, నిషేధిత ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త పడేస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లడమే కాకుండా ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. గాలి వీస్తే చెత్త సమీపంలోని ఇళ్ల ముందు వచ్చి చేరుతోంది. తడి, పొడి, హానికరమైన చెత్తను వేరుచేసి మున్సిపల్ కార్మికులకు అందించాలని ప్రజలకు అవగాహన కల్పించినా అమలుకు నోచుకోవడం లేదు. మరోవైపు డ్రెయినేజీల్లో పూడిక తీయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలక ముందే పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని కోరుతున్నారు.

నిషేధిత ప్రాంతాల్లో చెత్త

పట్టణంలోని ద్వారకానగర్, సీతాపతిరోడ్, సీహెచ్‌సీ, బాలాజీనగర్, గాంధీచౌక్, మార్కెట్ ఏరియాల్లో చెత్త వేయవద్దని మున్సిపల్ అధికారులు బోర్డులు ఏర్పాటు చేసినా ఆయా కాలనీల ప్రజలు చెత్తను అక్కడే వేస్తున్నారు. ఉదయం మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను తొలగించినా మళ్లీ అక్కడే వేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది.

నెలల తరబడి తీయని పూడిక

పట్టణంలోని బాలాజీనగర్, గాంధీనగర్, న్యూకాలనీ, టీచర్స్ కాలనీ, సంజీవయ్య కాలనీ, నిజాముద్దీన్‌కాలనీ, రైల్వేస్టేషన్ రోడ్, నౌగాం బస్తీ, కాపువాడ, తదితర కాలనీల్లోని డ్రెయినేజీల్లో నెలల తరబడి పూడిక తీయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. కొన్నిచోట్ల డ్రెయినేజీల్లో ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారంతో నిండిపోయాయి.

రోడ్లపైకి మురుగునీరు

పట్టణంలోని ప్రధాన మార్కెట్ ఏరియా, పొట్టి శ్రీరాములు చౌరస్తా, చోటిమసీద్, ఇందిరా మార్కెట్ ఏరియాల్లోని డ్రెయినేజీలు ఇరుకుగా ఉండడంతో పాటు కాలువల్లో దుకాణదారులు ప్లాస్టిక్ కవరు, చెత్తాచెదారం వేయడంతో చిన్నపాటి వర్షం కురిసినా మురుగు కాలువల్లోని చెత్తా చెదారం, మురుగునీరు నీరు రోడ్లపై పారుతోంది.

135 మంది సిబ్బంది విధులు

కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 30 వార్డులు ఉన్నాయి. చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణకు 135 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో పర్మినెంట్ 21, ఔట్ సోర్సింగ్ 107, ఎంఎస్‌ఆర్ ఏడుగురితో పాటు 7 చెత్త ట్రాక్టర్లు, 20 ట్రాలీలు, 1 జేసీబీ, 1 డోజర్‌లతో ప్రతిరోజు 24 మెట్రిక్ టన్నుల చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు.

పేరుకుపోతున్న చెత్తాచెదారం

• స్వచ్ఛ ఆసిఫాబాద్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు ముమ్మరం

ఆసిఫాబాద్‌అర్బన్: నూతనంగా ఏర్పడిన ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో ఏడాదికాలం పూర్తయినా పారిశుద్ధ్య పనుల నిర్వహణ ఇంకా గాడిలో పడకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. వర్షాకాలం సీజన్ ఆరంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ దీపాల ఏర్పాటు అంతంత మాత్రంగానే ఉంది. డ్రెయినేజీలు పూర్తిగా చెడి పోవడంతో రోడ్లపైకి మురికి నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రజలు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిగా చెడిపోవడంతో చిన్నపాటి వర్షానికే రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి.

తడి, పొడి చెత్తపై చర్యలు కరువు

పట్టణంలో ప్రతీరోజు వాహనాల ద్వారా తొలగించే తడి, పొడి చెత్తను వేరువేరుగా తొలగించకపోవడంతో కాలనీల్లో చెత్త వాహనాలు వెళ్తున్న క్రమంలో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. పలు కాలనీలకు ప్రతీరోజు చెత్త వాహనాలు రాకపోవడంతో ప్రజలు కాలనీలోని ముఖ్య కూడళ్ల వద్ద చెత్తను పడేస్తున్నారు. దీంతో అటుగా వెళ్లేవారు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఆసిఫాబాద్ పట్టణంలో 4 ట్రాక్టర్లు, 5 స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్తను సేకరిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. కార్యాలయంలో122 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో కనీసం ఒక్క ఫాగింగ్ మిషన్ కూడా లేకపోవడం దురదృష్టకరం. పట్టణంలో ఒకవైపు వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నా వాటిని కట్టడి చేసే నాథుడే లేడు. పాలకులు మారినా, అధికారులు మారినా మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య పనులు నామమాత్రంగా కొనసాగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. కనీసం జూన్ 2 నుంచి ప్రారంభమైన రైసింగ్ 2047 లక్ష్యంగా చేపట్టిన 100 రోజుల ప్రత్యేక ప్రణాళికలోనైనా పారిశుద్ధ్యం, ఇతర సమస్యలు పరిష్కారం అవుతాయా అని ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో వీధి దీపాల కొరత తీవ్రంగా వేధిస్తోంది. రాత్రి సమయాల్లో పలు కాలనీలకు వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. ఇటీవల ఆసిఫాబాద్ మున్సిపాలిటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన గజానంద్ పారిశుద్ధ్యం నిర్వహణ, స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



సందీప్‌నగర్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం

అధికారులు పర్యవేక్షించాలి



శానిటేషన్ అధికారులు నిత్యం పట్టణంలో పర్యవేక్షించాలి. కార్మికుల పనితీరు, కాలనీల్లో సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలి. వర్షాకాలం ముఖ్యంగా దోమల బెడద విపరీతంగా ఉంటుంది. ఫాగ్ మిషన్‌ను అందుబాటులోకి తీసుకురావాలి. చెత్తను తొలగించే వాహనాల సంఖ్య పెంచాలి.

– మంథెన సదాశివ్, ఆసిఫాబాద్

ప్రజల సహకారం అవసరం



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తెలంగాణా రైసింగ్ 2047 లక్ష్యంగా జూన్ 2 నుంచి సెప్టెంబర్ 10 వరకు వంద రోజుల పాటు మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ప్రతీరోజు కాలనీల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నాం. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. స్వచ్ఛ ఆసిఫాబాద్‌కు ప్రజల సహకారం ఎంతో అవసరం.

– గజానంద్, మున్సిపల్ కమిషనర్, ఆసిఫాబాద్

యూరియా కోసం రైతుల రాస్తారోకో



రెబ్బెనలో రాస్తారోకో చేస్తున్న రైతులు

రెబ్బెన: పీఏసీఎస్‌కు వచ్చిన యూరియా పంపిణీకి టోకెన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం రైతులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు రోజులుగా పీఏసీఎస్‌కు వస్తున్నా ఒక్క బస్తా యూరియా కూడా దొరకడంలేదన్నారు. ముందు రోజు జారీ చేసిన టోకెన్లకు యూరియా పంపిణీ చేస్తున్నారన్నారు. శనివారం ఉదయం వచ్చిన యూరియా లోడ్‌కు సంబంధించిన టోకెన్లయినా జారీ చేయాలని కోరగా వ్యవసాయ అధికారులు నిరాకరిస్తున్నారన్నారు. పనులు వదిలేసి రోజుల తరబడి తిరుగుతున్నా యూరియా దక్కకపోతే పంటలను ఎలా కాపాడుకోవాలని ప్రశ్నించారు. స్పందించిన అధికారులు టోకెన్లు జారీ చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

ఓటరు జాబితా అందుబాటులో ఉంచుకోవాలి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా

దహెగాం(సిర్పూర్): బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వో)లు బూత్‌స్థాయి ఓటరు జాబితా అందుబాటులో ఉంచుకోవాలని సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారు. సర్వేకు వెళ్లినప్పుడు ఓటర్లతో ఎలా మాట్లాడాలో వివరించారు. గ్రామానికి చెందిన ఓటరు ఇతర ప్రాంతాలకు వెళ్లి స్థిరపడితే కుటుంబ సభ్యులకు ముందుగా నోటీసు ఇచ్చిన వారం రోజుల తర్వాత పేరు తొలగించాలన్నారు. తహసీల్దార్ మునవార్ షరీఫ్, ఎలక్షన్ డీటీ జోగయ్య, సీనియర్ అసిస్టెంట్ సంతోష్, డీటీ గణేశ్ పాల్గొన్నారు.

'మహిళా శక్తి' పనులు వేగవంతం చేయాలి



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

• కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: జిల్లాలో నిర్మిస్తున్న మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను పంచాయతీరాజ్ ఈఈ అజ్మీర కృష్ణతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రూ.5 కోట్ల ప్రత్యేక నిధులతో చేపడుతున్న భవన నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఈ ఏడాది అక్టోబర్ చివరిలోగా పనులు పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించాలని, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఆర్‌ఆర్ కాలనీలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసి, ప్రతీ సోమవారం లబ్ధిదారుల ఖాతాలో నగదు జమచేయాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ గజానంద్, సంబంధిత అధికారులు ఉన్నారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్సీ



'పొన్నం'కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ విఠల్



మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ

చింతలమానెపల్లి: నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్సీ దండె విఠల్, కాంగ్రెస్ నాయకులు శనివారం హైదరాబాద్‌లో స్త్రీ, శిశు, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. డబ్బాలో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని, సిర్పూర్‌లో ప్రయాణ ప్రాంగణం కోసం రూ.2 కోట్ల నిధులు కేటాయించాలని, హైదరాబాద్‌కు అదనంగా బస్సు సర్వీసులు కల్పించాల ని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సిడాం గణపతి, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల అధ్యక్షులు సుల్కరి ఉమామహేష్, విశ్వేష్, నాయకులు గజ్జి రామయ్య, అశోక్, కొండు శంకర్, రాచకొండ శ్రీవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి పీఎం జుగా

తిర్యాణి: గిరిజనుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం పీఎం జుగా పథకాన్ని ప్రవేశపెట్టిందని డీటీడీవో రమాదేవి అన్నారు. శనివారం మండలంలోని దంతాన్‌పెల్లిలో పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులందరికీ ఆధార్‌కార్డు అప్‌డేట్‌తో పాటు నూతన కార్డు మంజూరూ, బర్త్ సర్టిఫికెట్ కోసం ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. పీఎం జుగాపై కళాజాత బృందం సభ్యులు నిర్వహించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సమావేశంలో ఎంపీడీవో మల్లేశ్, వెటర్నరీ వైద్యుడు సాగర్, ఏపీఎం శ్రీనివాస్, పీఎం జుగా మండల కోఆర్డినేటర్ వెడ్మ యశ్వంత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీటీడీవో రమాదేవి

మొక్కలను సంరక్షించాలి

తిర్యాణి: నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని డీటీడీవో రమాదేవి అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శనివారం దంతాన్‌పెల్లిలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా ఏడాదిలో కనీసం రెండు మొక్కలు నాటాలన్నారు. మొక్కలను విరివిరిగా పెంచడం ద్వారానే పర్యావరణ సమతుల్యం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వేముల మల్లేశ్, టెక్నికల్ అసిస్టెంట్ వోడిగ సాగర్, పంచాయతీ కార్యదర్శి రాము, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న డీటీడీవో రమాదేవి

న్యూస్‌రీల్

ఎస్పీని కలిసిన ఎస్సైలు



ఎస్పీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్సైలు

ఆసిఫాబాద్: జిల్లాలో నూతనంగా నియామకమైన బెజ్జూర్, పెంచికల్‌పేట్ ఎస్సైలు ఎండి సర్తజ్‌పాషా, ఎం.అనిల్‌కుమార్ శనివారం ఎస్పీ కాంతిలాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

విస్తారంగా వర్షాలు

ఆసిఫాబాద్: వారం రోజులుగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం జిల్లా వ్యాప్తంగా 17.6 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదు కాగా అత్యధికంగా 33.6 మిల్లీ మీటర్లు నమోదైంది. జైనూర్‌లో 22.8, సిర్పూర్(యూ)లో 30.4, లింగాపూర్‌లో 24.6, తిర్యాణిలో 3.4, రెబ్బెనలో 8.4, ఆసిఫాబాద్‌లో 8.2, కెరమెరిలో 23.2, వాంకిడిలో 28.6, కాగజ్‌నగర్‌లో 14.2, సిర్పూర్(టి)లో 20.6, కౌటాలలో 17.8, బెజ్జూర్‌లో 16.2, పెంచికల్‌పేట్‌లో 7.0, దహెగాంలో 5.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

యూరియా పంపిణీలో ఇబ్బందుల్లేకుండా చూడాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ డేవిడ్

వాంకిడి: యూరియా పంపిణీలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్ట ర్ (రెవెన్యూ) డేవిడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయాన్ని సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. రైతులకు యూరియా త్వరగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరో రెండు కౌంటర్లను అదనంగా ఏర్పాటు చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరగా పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. రేషన్ కార్డుల మంజూరులో జాప్యం జరగకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఏడీఏ జాడి మిలింద్ కుమార్, తహసీల్దార్ కవిత, మండల వ్యవసాయ అధికారి గోపికాంత్, డీటీ రాంలాల్, తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వంటలు పరిశీలిస్తున్న అధికారి సజీవన్

సిర్‌పూర్(టి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా సాంఘిక సంక్షేమాధికారి సజీవన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర, బాలికల వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటువ్యాధులు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులకు వండిన భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం పెట్టాలని సూచించారు. ఆయన వెంట వార్డెన్ సంజీవ్, సిబ్బంది ఉన్నారు.

జీవో 49 రద్దు చేయాలి

ఆసిఫాబాద్: జీవో 49 రద్దు చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు కోట్నాక విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో ఆదివాసీ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 49 రద్దు చేయాలని ఈ నెల 6 నుండి అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలన్నారు. 14న తహసీల్దార్, అటవీ శాఖ కార్యాలయాల ఎదుట ధర్నా, 21న ఉమ్మడి జిల్లాలో బంద్, 28న కలెక్టరేట్ ఎదుట మహాధర్నా చేపట్టాలన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం పీఈటీ

వేమనపల్లి: మంచిర్యాలలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల్లో మండలంలోని నీల్వాయి జెడ్పీఎస్ఎస్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం గిరిధర్ రెడ్డి, పీఈటీ దాసరి మల్లేశ్ తెలిపారు. వశాక రజిత, అల్వియ మహివీన్, చింతల మహేశ్వరి, కొట్రంగి అనూష సత్తాచాటారు. హన్మకొండలో జవహర్‌లాల్ స్టేడియంలో ఆదివారం జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

కొత్త ప్లాంట్ నిర్మాణ పనులపై సమీక్ష



మాట్లాడుతున్న డైరెక్టర్ సత్యనారాయణరావు

జైపూర్: 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ విస్తరణలో భాగంగా నూతనంగా నిర్మించనున్న మూడో యూనిట్ (800మెగావాట్ల) థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులపై సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణరావు శనివారం అడ్మిన్ భవన కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనుల పురోగతిని అధికారులు వివరించారు. నిర్దేశిత గడువులోపు పనులు పూర్తిచేసేందుకు ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం సింగరేణి ఉద్యోగి, ఉత్తమ జ్యోతిష్య, జాతీయ ప్రతిభ రత్న, బంగారు నంది అవార్డు గ్రహీత డాక్టర్ దూళిపాళ్ల మల్లికార్జునశర్మను అధికారులు ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జ్యోతిష్యంపై మక్కువతో మల్లికార్జునశర్మ బెనారస్ హిందూ యూనివర్సిటీ నుంచి జ్యోతిష్యశాస్త్రంలో గోల్డ్ మెడల్ సాధించారని తెలిపారు. సాయంత్రం 5గంటలకు సంస్థ సీఎండీ బలరాం థర్మల్ పవర్ ప్లాంట్, సోలార్ ప్లాంట్ల విద్యుత్ ఉత్పత్తి, ఉత్పాదకత మీద నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎంలు శ్రీనివాసులు, నరసింహారావు, వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, ఏబీటీ యూసీ సెక్రటరీ సత్యనారాయణ, సీఎంవోఏఐ సెక్రటరీ సంతోష్‌కుమార్, ఏజీఎంలు మురళీధర్, మధన్‌మోహన్, డీజీఎం కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రేబిస్‌తో జాగ్రత్త

- పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం
- సీజన్‌కు అనుగుణంగా టీకాలు తప్పనిసరి
- నేడు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం



జిల్లా పశువైద్యాధికారి ఈ.శంకర్

మంచిర్యాలఅగ్రికల్చర్: కుక్కలు, పశువులు, కోళ్లు, పక్షుల నుంచి మనుషులకు సంక్రమించేవి జూనోసిస్ వ్యాధులు అంటారు. పశువుల పాకల అపరిశుభ్రత, తదితర కారణాల వల్ల సుమారు 200 రకాల వ్యాధులు సోకే అవకాశం ఉంది. ఈ వ్యాధులపై పశుపోషకులు, జంతు ప్రేమికులు అప్రమత్తంగా ఉండాలి. దీనిపై అవగాహన కల్పించి, ఆ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి శంకర్ పేర్కొంటున్నారు. పశువుల కాపర్లు, పశువైద్యులు, కుక్కలు, పక్షులు పెంచేవారు, పశువుల డెయిరీ ఫాంలో పనిచేసే వారు అప్రమత్తంగా ఉండాలి. పెంపుడు కుక్కలను పెంచడంలో జాగ్రత్తలు తీసుకోవాలి. శుచి, శుభ్రత పాటించడం ఈ వ్యాధులకు దూరంగా ఉండవచ్చు.

ఇదే రోజు ఎందుకు?

1885 జూలై 6న లూయిస్ ప్యాశ్చర్ అనే శాస్త్రవేత్త పిచ్చికుక్క కరిచిన ఓ బాలుడికి మొదటిసారిగా వ్యాధి నిరోధక టీకా ఇచ్చారు. ఆ ప్రయత్నం విజయవంతం కావడంతో జూలై 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవంగా పాటిస్తారు.



పెంపుడు కుక్క ల్యాబ్‌బ్రాడర్

పిచ్చికుక్క కాటుతో..

పిచ్చికుక్కకాటు వల్ల పశువులు, కుక్క కరిచిన మనుషులకు రేబిస్ సోకుతుంది. ఈ వ్యాధి ప్రాణాంతకమైనది. పిల్లులు, ముంగిసలు, నక్కలు, తోడేళ్లు తదితర జంతువుల ద్వారా చిట్టెలుక నుంచి ఏనుగు వరకు అన్ని క్షీరదాలకు ఈ వ్యాధి సోకుతుంది. కుక్క కరిచిన తర్వాత 2 నుంచి 3 వారాల తర్వాత వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. ఒక్కోసారి 5 నుంచి 6 నెలల తర్వాత బయటపడుతాయి. కుక్కల ద్వారా గజ్జి వంటి చర్మ వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో పిచ్చికుక్కకాటుకు గురై పశువులు, మనుషులు మృత్యుబారిన పడుతుంటారు.

అంత్రాక్స్- బ్రూసెల్లోసిస్

పశువుల నుంచి మనుషులకు దొమ్మ(అంత్రాక్స్), బ్రూసెల్లోసిస్ తదితర వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. సరిగా వైద్యం చేయిస్తే వ్యాధిని అరికట్టవచ్చు. దీని నివారణకు టీకాలు అందుబాటులో ఉన్నాయి. కలుషితమైన పాలు తాగితే క్షయ సోకుతుంది. పందులు, కొంగలు నివాస ప్రాంతాలకు చేరువలో ఉన్నప్పుడు మనుషులు వీటి ద్వారా కూడా మెదడు వాపు సోకవచ్చు. పందులు, దోమలను అరికడితే ఈ వ్యాధి వ్యాప్తిని నివారించవచ్చు.

పెంపుడు కుక్కలకు ప్రతీఏటా యాంటీ రేబిస్ వ్యాక్సిన్(ఏఆర్‌వీ) ఇప్పిస్తే ఈ వ్యాధిని అరికట్టవచ్చు. సీజన్‌కు అనుగుణంగా పశువులు, పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ టీకా సకాలంలో వేయించాలి. పెంపుడు కుక్కలకు మొదటిసారి 30వ రోజు, బూస్టర్ డోసు 90వ రోజు టీకాలు వేయించాలి.

సకాలంలో టీకాలు వేయించాలి

వ్యాధులు సోకిన జంతువులు, కోళ్ల మాంసాన్ని సరిగా ఉడకని గుడ్లు తినవద్దు. చెడిపోయిన, అపరిశుభ్రంగా ఉన్న పాలు, మాంసం, గుడ్లు ఆహారంగా తీసుకోవద్దు. వ్యాధి సోకిన పశువుల పాలు తాగవద్దు. పాడి పశువులు, జంతువుల పాకలను శుభ్రంగా ఉంచాలి. కాలానికనుగుణంగా పశువులు, జంతువులు, పక్షులు, కోళ్లకు రోగ నిరోధక టీకాలు వేయించాలి. చనిపోయిన పశువులు, జంతువులను దూరప్రాంతాల్లో లోతైన గోతిలో సున్నంచల్లి పూడ్చిపెట్టాలి.

పాలిటెక్నిక్ సీట్లకు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్: సీసీసీలోని సింగరేణి పాలిటెక్నిక్ కాలేజీలో యాజమాన్యం కోటా సీట్లు భర్తీ చేశారు. శనివారం కౌన్సెలింగ్‌కు కంపెనీ ఉద్యోగుల పిల్లలు, రిటైర్డ్ ఉద్యోగుల పిల్లలు హాజరయ్యారు. మొత్తం సీట్లలో యాజమాన్యం కోటా కింద సగం సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేశారు. ప్రతీ కోర్సుల్లో 30 సీట్ల చొప్పున 150 సీట్ల ఉండగా, కౌన్సెలింగ్‌లో 84 మంది విద్యార్థులు సీట్లు పొందారు. మొదటి సీటును 1,445 ర్యాంకు సాధించిన ఈ.సుజల్ అనే విద్యార్థి కంప్యూటర్స్‌లో సీటు పొందగా, ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్‌రావు ఆయనకు అడ్మిషన్ అందించారు. మిగిలిన సీట్లలో.. సివిల్‌లో 26, కంప్యూటర్స్‌లో 01, ఎలక్ట్రికల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో 5, మెకానికల్‌లో 24, మైనింగ్‌లో 10 సీట్లను త్వరలో స్పాట్ కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తామన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.దేవేందర్, హెచ్ఓడీలు జి.దామోదర్, జి.రవీందర్, నరసింహాస్వామి, శ్యామల, కె.సుమన్ పాల్గొన్నారు.



అడ్మిషన్ పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు

చోరీ సామగ్రిని తిరిగి వదిలిన ఆగంతకులు

బెల్లంపల్లి: మండలంలోని గురిజాల రైతువేదిక నుంచి అపహరించుకు వెళ్లిన సామగ్రిని ఆగంతకులు తిరిగి అక్కడే వదిలివెళ్లారు. గురువారం రాత్రి రైతు వేదిక తాళం పగులగొట్టి అందులో సామగ్రిని పట్టుకెళ్లిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై వ్యవసాయ అధికారులు తాళ్లగురిజాల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. సామగ్రిని ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు 24 గంటల వ్యవధిలో శుక్రవారం రాత్రి ఆ రైతు వేదిక వద్ద తీసుకువచ్చి వదిలివెళ్లారు. బెల్లంపల్లి ఏడీఏ రాజా నరేందర్, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, తాళ్లగురిజాల ఎస్సై సీహెచ్.రమేశ్, ఏవో ప్రేమ్‌కుమార్ శనివారం ఉదయం అక్కడికి చేరుకుని చోరీకి గురైన సామగ్రిని పరిశీలించారు. ఈ ఘటనపై తదుపరి విచారణ చేస్తామని వ్యవసాయ, పోలీసు అధికారులు తెలిపారు.



గురిజాల రైతువేదిక వద్ద వదిలివెళ్లిన సామగ్రి

అనుమానాస్పదంగా యువకుడి మృతి



దినేశ్ (ఫైల్)

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గద్దెరాగిడి అమ్మాగార్డెన్స్ ప్రాంతానికి చెందిన తడక దినేశ్ (29) అనుమానాస్పదంగా మృతిచెందాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో అపస్మారక స్థితిలో ఉండటాన్ని గమనించిన స్నేహితులు వెంటనే అతన్ని మంచిర్యాల ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. స్నేహితులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడ నిద్రమాత్రలు లభించాయని, ఆ మాత్రలు వేసుకుని దినేశ్ ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నామని పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. కాగా, అమెరికాలో ఉన్న కూతురు మౌనిక వద్దకు తల్లిదండ్రులు పద్మావతి, రవి ఇటీవల వెళ్లారు. దీంతో వారు తిరిగి వచ్చేవరకు మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీలో ఉంచారు. వారి ఫిర్యాదు అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం చేయిస్తామని పట్టణ ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

సోన్: పురుగుల మందు తాగిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని మాదాపూర్‌కు చెందిన సల్ల భోజవ్వ (54)కు కుమారుడు నరేశ్ ఉన్నారు. నరేశ్‌కు పెళ్లి చేసింది. పదేళ్ల క్రితం భర్త నరేశ్‌తో గొడవపడి భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో భోజవ్వ బాధపడుతుండేది. కోడలు రావడం లేదని మనస్తాపం చెందిన ఆమె శుక్రవారం సాయంత్రం ఇంట్లో గుర్తు తెలియని పురుగుల మందు తాగింది. కుమారుడు నరేశ్ గమనించి నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. కుమారుడు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.గోపి తెలిపారు.

మహిళలను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: మహిళలను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన అనీస్ రైల్వేస్టేషన్ ఎదుట నుంచి వెళ్తున్న మహిళలు, యువతులను వేధింపులకు గురి చేస్తున్నాడని తెలిపారు. పలువురు షీ టీంకు సమాచారం అందించగా.. అదుపులోకి తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

అడవిపంది దాడిలో ఒకరికి తీవ్రగాయాలు

ఇచ్చోడ: అడవిపంది దాడిలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని దేవుల్‌నాయక్ తండాకు చెందిన రాథోడ్ గంభీర్‌సింగ్ శనివారం వ్యవసాయ పొలంలో పనిచేస్తున్నాడు. అటవీ ప్రాంతం నుంచి వచ్చిన అడవి పంది ఒక్కసారిగా అతనిపై దాడి చేయగా తప్పించుకునే క్రమంలో జారిపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. గంభీర్‌సింగ్‌ను అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మద్యం తాగొద్దన్నందుకు భర్త ఆత్మహత్య



వెంకటేశ్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: మద్యం తాగొద్దని భార్య మందలించడంతో భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై దివాకర్, కుటుంబీకులు తెలిపిన వివరాలు.. జిల్లాకేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన ఒల్లెపు వెంకటేశ్(40), సుజాత దంపతులు. వీరికి కుమారుడు గణేశ్, కూతుళ్లు బిందు, దివ్య ఉన్నారు. కూలీ పనిచేస్తూ జీవనం సాగించేవా రు. వెంకటేశ్ గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ప్రతి రోజు మద్యం తాగి ఇంటికి రావడంతో తరచూ గొడవలు జరిగేవి. ఎదిగిన పిల్లలు ఉన్నారని, మద్యం తాగుడు మానేయాలని భార్య మందలించడంతో వెంకటేశ్ మనస్తాపం చెందాడు. శుక్రవారం ఎఫ్‌సీఐ గోదాము వెనుకాల మద్యం మత్తులో పురుగుల మందు తాగి చనిపోతున్నానని కుటుంబీకులకు ఫోన్‌చేసి చెప్పాడు. వారు అక్కడికి చేరుకుని అతన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదం.. పశువుల యజమానిపై కేసు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రోడ్డు ప్రమాదానికి కారణమైన పశువుల యజమానిపై హాజీపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ కార్పొరేషన్ పరిధి నర్సింగాపూర్‌కు చెందిన ఏనుగు జయపాల్‌రెడ్డి శనివారం ఉదయం కారులో మంచిర్యాల నుంచి నర్సింగాపూర్‌కు వెళ్తున్నాడు. వేంపల్లిలో జాతీయ రహదారిపై ఒక్కసారిగా మూడు బర్రెలు అడ్డు వచ్చాయి. దీంతో కారు బర్రెలను ఢీకొట్టి ధ్వంసం కాగా.. జయపాల్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. మూడు బర్రెలు మృతిచెందాయి. పశువులను ఇంటి వద్ద, కొట్టంలో ఉంచాల్సి ఉండగా.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాత మంచిర్యాల జ్యోతినగర్‌కు చెందిన పశువుల యజమాని కార్ల మల్లేశ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. మల్లేశ్‌ను అదుపులోకి తీసుకుని నోటీసులు జారీ చేశామని ఎస్సై తెలిపారు. పశువులను యజమానులు ఇళ్లు, కొట్టాల్లో కాకుండా రహదారులపైకి వదిలి ఇతరుల ప్రాణాలకు హాని కలిగించే విధంగా వ్యవహరిస్తే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

12న చెట్ల తొలగింపునకు వేలం

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ఐబీ చౌరస్తా నుంచి శ్రీనివాస గార్డెన్) వరకు (హైదరాబాద్-కరీంనగర్-చాందా రోడ్డు 251/9 నుంచి 255/7 కిలోమీటర్లు) విస్తరణలో భాగంగా ఇరువైపులా 63 చెట్ల తొలగింపునకు ఈనెల 12న వేలం పాట నిర్వహిస్తున్నట్లు రోడ్లు, భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ లక్ష్మీనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని రోడ్లు, భవనాల శాఖ కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు వేలం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ వేలంలో పాల్గొనాలని కోరారు.

ఆర్ఎంపీ క్లినిక్‌లపై చర్యలు తీసుకోవాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్



మాట్లాడుతున్న లక్ష్మణ్

రామకృష్ణాపూర్: అనుమతులు లేకుండా ఇష్టానురీతిన వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా సమితి సభ్యుడు వనం సత్యం డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. జిల్లా వైద్యాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొంతమంది ఆర్ఎంపీలు ఇష్టారీతిన వైద్యం చేస్తున్నారన్నారు. ఆర్‌కేపీలో ఓ ఆర్ఎంపీ నిర్లక్ష్యం కారణంగానే శ్రీనాథ్ అనే కాంట్రాక్ట్ కార్మికుడు ఇంజక్షన్ వికటించి మృతిచెందాడని అన్నారు. ఆ వైద్యుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధితుడి పక్షాన కాకుండా స్థానిక కొంతమంది నాయకులు ఆర్ఎంపీ పక్షాన నిలుస్తూ సెటిల్‌మెంట్లకు యత్నించడం బాధాకరమన్నారు. యువకుడి ప్రాణాన్ని రూ.2 లక్షలకు విలువ కట్టడం ఏమిటని మండిపడ్డారు. సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్, ఇప్పకాయల లింగయ్య, నక్క వెంకటస్వామి, సాంబయ్య, పాల్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీపత్రాలు సృష్టిస్తున్న ముఠా గుట్టురట్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- తండ్రి అరెస్ట్, పరారీలో కుమారుడు
- కంప్యూటర్, స్కానర్, హార్డ్‌డిస్క్‌లు స్వాధీనం
- వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ప్రభుత్వ శాఖల నకిలీపత్రాలు, స్టాంపులు, అధికారుల సంతకాల స్టాంపులు సృష్టించే ముఠాను ఆదిలాబాద్ పోలీసులు గుట్టురట్టు చేశారు. డాక్యుమెంట్ రైటర్ ముసుగులో అక్రమాలకు పాల్పడుతున్న తండ్రి, కుమారుడిపై కేసు నమోదు చేశారు. తండ్రిని అరెస్ట్ చేయగా కుమారుడు పరారీలో ఉన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ఈమేరకు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన లాడ్వే బద్రినాథ్ కుమారుడు రాహుల్‌కుమార్. ఇతను డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తున్నాడు. గత మూడేళ్లుగా తండ్రి కుమారుడు నకిలీపత్రాలు, స్టాంపులు సృష్టించి ప్రజలను మోసం చేస్తున్నట్లు ఫిర్యాదు అందింది. పక్కా సమాచారంతో శుక్రవారం రాత్రి వారి ఇంటిపై పోలీసులు దాడి చేశారు. వివిధ జిల్లాల్లో శాఖల అధికారుల సంతకాలతో కూడిన స్టాంపులు, పత్రాలు, వాటిని తయారుచేసే రసాయనాలు, పరికరాలు, కంప్యూటర్, స్కానర్, హార్డ్‌డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

నకిలీ పత్రాలతో అక్రమాలు

మావల మండలంలోని సర్వేనంబర్ 170లోని ప్లాట్ల పత్రాలను మండల రెవెన్యూ అధికారి కేటాయించినట్లుగా సృష్టించారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీకి సంబంధించి ట్రేడ్ లైసెన్స్ నకిలీపత్రాలు, పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన, ఆర్టీవో వాహన రిలీజ్ పత్రాలు, ఆధార్‌కార్డుల తోపాటు వివాహ సర్టిఫికెట్లు సృష్టించి అక్రమాలకు పాల్పడ్డారు. వివిధ హాస్పిటల్స్‌కు సంబంధించిన నకిలీ డాక్యుమెంట్లు తయారుచేసి ప్రభుత్వం ద్వారా కొంతమందికి విక్రయించి లబ్ధిని పొందేలా చూశారు. మహాలక్ష్మి మాన్‌పవర్ అండ్ ప్లేస్మెంట్స్ సర్వీసెస్ అనే ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా నకిలీ ఉద్యోగ నియామకపత్రాలు తయారు చేసి మోసగించారు. నకిలీ పత్రాలతో ప్రభుత్వ స్థలాలను కబ్జాచేసిన వారిని పట్టుకునేందుకు ప్రత్యేకంగా పోలీస్ బృందాలు ఏర్పాటు చేస్తామని ఎస్పీ తెలిపారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ ముఠా గుట్టు రట్టు చేయడంలో కీలకపాత్ర పోషించిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, వన్‌టౌన్ సీఐ బి.సునీల్ కుమార్‌లను అభినందించారు. సమావేశంలో డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ బి.సునీల్‌కుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నకిలీ డాక్యుమెంట్లు, పట్టాలు

నేడు తొలి ఏకాదశి

- చాతుర్మాస్య వ్రతాలు ప్రారంభం
- కిటకిటలాడనున్న ఆలయాలు

చెన్నూర్: తొలి ఏకాదశి పండగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఆషాఢశుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశి అంటారు. సంవత్సరం మొత్తంలో 24 ఏకాదశులు ప్రతినెల కృష్ణపక్షంలో ఒకటి, శుక్లపక్షంలో ఒకటి మొత్తం రెండు ఏకాదశులు వస్తాయి. ఆదివారం తొలి ఏకాదశి పండగ నుంచే చాతుర్మాస్య వ్రతాలు ప్రారంభమవుతాయి. ఆషాఢ శుక్ల పక్షం నుంచి కార్తీక శుక్లపక్షం వరకు చాతుర్మాస్య దీక్షలు చేయడం అనవాయితీగా వస్తుంది. తొలి ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు యోగా నిద్రకు ఉపక్రమిస్తారు. దీన్ని శయన ఏకాదశి అని పిలుస్తారు. నాలుగు నెలల తర్వాత కార్తీక శుద్ధ ఏకాదశి మేల్కొంటారు. ఈ నాలుగు నెలల కాలాన్ని ప్రజలు పవిత్ర నెలలుగా భావించి చాతుర్మాస్య దీక్షలు చేస్తారు.

పండగ విశిష్టత..

భక్తులు సూర్యోదయానికి ముందే గోదావరినదిలో స్నానాలు ఆచరించి మహావిష్ణువు ఆలయాలను సందర్శించి పూజలు చేస్తారు. చాతుర్మాసం ప్రారంభం కానుండడంతో శ్రీ మహావిష్ణువు ఆలయాలు కిటకిటలాడుతాయి. తొలి ఏకాదశి రోజున ఉపవాసం ఉండి తర్వాత రోజు మహావిష్ణువును పూజించి నైవేద్యం సమర్పించి భోజనం చేస్తారు.



చెన్నూర్ జగన్నాథాలయం

వ్రతాలు ఆచరించాలి



తొలి ఏకాదశి నుంచి చాతుర్మాస్య వ్రతాలు ఆచరించాలి. శ్రీమహావిష్ణువు యోగా నిద్రకు ఉపక్రమించే రోజు కావడంతో తొలి ఏకాదశి రోజున ఉపవాసం చేసి మహావిష్ణువు పూజిస్తే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయి. – వేమూరం మహేశ్వర్‌శర్మ, అర్చకుడు, శివాలయం

భూకబ్జాకు పాల్పడిన 9 మందిపై కేసు

- ఐదుగురి అరెస్ట్, పరారీలో నలుగురు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: భూమి పత్రాలను ఫోర్జరీ చేసి, ప్లాట్లను కబ్జా చేసి డబ్బులు డిమాండ్ చేస్తూ యజమానులను బెదిరించిన 9 మందిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. మావల పోలీసుస్టేషన్‌లో శనివారం ఈమేరకు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని భుక్తపూర్ కాలనీకి చెందిన జనకొండ పోసాని 2009లో ఖానాపూర్ శివారు ప్రాంతంలోని సర్వే నంబర్ 68/44/1లో 30, 38 నంబర్ గల రెండు ప్లాట్లు కొనుగోలు చేశారు. మావల పోలీసుస్టేషన్ పరిధిలోని పైక్ రావు ఆనంద్ (మాజీ కౌన్సిలర్ కుమారుడు), సద్దాం హుస్సేన్, షేక్ షాదుల్లా, బోడకుంట రాజు, అజీముద్దీన్, సంతోష్, మనోహర్, షాబానా బేగం, హీనా అంజుమ్‌లు తప్పుడు పత్రాలు సృష్టించి ఆ ప్లాట్లను కబ్జా చేశారు. మున్సిపల్ అధికారులను మోసం చేసి ఇంటి నంబర్లు పొందారు. దీంతో బాధితురాలు ఈనెల 3న పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. శుక్రవారం ఐదుగురు నిందితులు పైక్ రావు ఆనంద్, సద్దాం, షేక్ షాదుల్లా, బోడకుంట్ల రాజు, షేక్ అజీముద్దీన్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. మిగతా నలుగురు సంతోష్, మనోహర్, షాబానా బేగం, హీనా అంజుమ్‌లు పరారీలో ఉన్నారు. వారిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా అరెస్టైన వారిని 15 రోజుల రిమాండ్‌కు తరలించారు. ప్లాట్ ఇంటి నంబర్లకు సహకరించిన మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్, రెవెన్యూ ఆఫీసర్ జాదవ్ కృష్ణపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో మావల సీఐ కర్రె స్వామి, ఎస్సై ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ప్రజల భద్రత కోసమే కార్డన్‌సెర్చ్



మాట్లాడుతున్న ఏసీపీ ప్రకాశ్

మంచిర్యాలక్రైం: ప్రజల భద్రత కోసమే కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ఏసీపీ ఆర్.ప్రకాశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో శనివారం రాత్రి కార్డన్ సెర్చ్‌లో భాగంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ లేకుండా ఎలాంటి పత్రాలు లేని 30 బైక్‌లు, బెల్ట్ షాపుల వద్ద నుంచి సుమారు రూ.10 వేల విలువ గల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో కౌన్సెలింగ్ ఏర్పాట్లపై సమీక్ష



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్

బాసర: ఆర్జీయూకేటీలో అడ్మిషన్ల కౌన్సెలింగ్ ఏర్పాట్లపై అధికారులతో ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాసర, మహబూబ్‌నగర్ కేంద్రాల్లో ఈనెల 7, 8, 9 తేదీల్లో అడ్మిషన్ల కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకు గాను అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో అడ్మిషన్ల కన్వీనర్ చంద్రశేఖర్, కోకన్వీనర్ దేవరాజు, బండి హరికృష్ణ, అడ్వైజరీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.